క్లుప్తంగా

ఒడ్డుక చింతల కల్లాల్లో వినాయక పూజలు


వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ

దేవరాపల్లి : దేవరాపల్లిలోని ఒడ్డు చింతల కల్లాలు, సంతతోటలో గురువారం భారీ అన్న సమారాధనలు జరిగాయి. ఈ రెండు చోట్ల అధిక సంఖ్యలో భక్తజనం తరలివచ్చి స్వామి వారి మహా ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణ రమణమ్మ పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబు రావు, డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, లలితానాయుడు, రమాదేవి, వేచలపు వాణి తదితరులు యూత్ సభ్యులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన పూజలు


బాలవినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం

మాడుగుల : మూడురోడ్ల కూడలిలో బాల వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. సుమారు 69 సంవత్సరాల నుంచి బాల వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో లక్షబిల్వార్చన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం విశేషం.

భారీగా అన్న సమారాధనలు


పాచిలవానిపాలెంలో అన్నసమారాధనలో పాల్గొన్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ


కె.కోటపాడు : అన్నిదానాల్లో కెల్లా అన్నదానమే మిన్న అని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అన్నారు. పాచిలవానిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గ్రామానికి చెందిన ప్రజలు గురువారం అన్నసమారాదన కార్యక్రమాన్ని జరిపారు. పాచిలవానిపాలెం, జి.జగన్నాథపురం, బంటువారి కళ్లాలు, గరుగుబిల్లి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అదే విధంగా చౌడువాడలో గంగుమళ్ల, కుంచా వారి వీధుల్లోను, గొండుపాలెంలో కర్ణంగారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద అన్నసమారాధన జరిపారు.

ఊర చెరువు గట్టుపై మొక్కలు ఏర్పాటు


చెరువు గట్టుపై మొక్కలు వేస్తున్న కూలీలు

నాతవరం : రైతులతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా చెరువు గట్టును అభివృద్ధి చేస్తామని వై.బి.అగ్రహారం సర్పంచ్ కోసూరి విజయ వైఎస్సార్‌సీపీ ఆర్‌టీయాక్టు మండల శాఖ అధ్యక్షుడు కోసూరి బుచ్చి అన్నారు. వై.బి.అగ్రహారం పంచాయతీలో గల ఊర చెరువును గురువారం పరిశీలించి అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఊర చెరువు గ్రామాన్ని అనుకుని ఉందన్నారు. ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు కోరక మేరకు చెరువు గట్టును పటిష్టం చేసి, పాటు వివిధ రకాలు మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. చెరువు అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు.

పీఏసీఎస్ నూతన పాలకవర్గం


కొత్త పాలకవర్గాన్ని పూలమాలలతో సత్కరిస్తున్న రైతులు, నాయకులు, ఎమ్మెల్యే రాజు

చోడవరం: జన్నవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా బెన్నవోలుకు చెందిన మజ్జి గౌరీశంకర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన సంఘ కార్యాలయంలో గురువారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మచ్చిరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, సకురు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి లేని చెత్త సేకరణ


ఇలాంటి రిక్షానే కష్టపడి లాక్కుంటూ వెళుతున్న స్వీపర్లు


రిక్షా చక్రం పూర్తిగా విరిగిపోయి, ఊడిపోయి గాలి లేకుండా ఉన్న దృశ్యం

- మూలకు చేరిన చెత్త సేకరణ రిక్షాలు
- ఇబ్బందులు పడుతున్న స్వీపర్లు
- ఇళ్ల వద్ద నిల్వ ఉండిపోతున్న చెత్త

గొలుగొండ : గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి. దీని కోసం అధికారులు పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర(సాసా) ప్రతి నెలా మూడో శనివారం అధికారులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో ఈ లక్ష్యానికి చిత్తశుద్ధి కరువైంది. చెత్తను సేకరించే రిక్షాలు పూర్తిగా మూలకు చేరినా వీటి మరమ్మతులపై పంచాయతీ, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

మండలంలో 29 పంచాయతీలకు సుమారుగా 55 వరకు రిక్షాలు ఉన్నాయి. వీటి ద్వారా స్వీపర్లు ప్రతి రోజు ఉదయం రిక్షాలపై ప్రతి వీధుల్లో తిరిగి తడి, పొడి చెత్తను సేకరించి వాటి ద్వారా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద వర్మికంపోస్టులు తయారీ చేయడం జరుగుతుంది. కానీ ఈ చెత్తను సేకరించే చాలా రిక్షాలు మూలకు చేరాయి. కనీసం గాలి పోయినా, రిమ్ములు పోయినా, వాటి స్టమ్‌లు విరిగిపోయినా పట్టించుకొనే వారు లేరు. దీని కారణంగా చెత్తను సేకరించడంలో స్వీపర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 29 పంచాయతీల్లో సగానికి పైగా ఈ రిక్షాలు పూర్తిగా మరమ్మతులకు చేరుకున్నాయి.

స్వీపర్లకు ఇబ్బందులు

స్వీపర్లు రిక్షాలను పట్టుకొని వీధుల్లో తిరగడం వల్ల ప్రజలు వాటి ఇంటి వద్ద ఉన్న చెత్తను తీసుకువచ్చి రిక్షాల్లో వేయడం జరుగుతుంది. కానీ రిక్షాలు సరిగా లేక పంచాయతీకి ఒకటికి మంచి పనిచేయకపోవడంతో ఈ చెత్తను స్వీపర్లు సేకరించలేకపోతున్నారు. దీని వల్ల ఇంటి వద్ద, వీధుల్లో చెత్త పేరుకుపోయి వ్యాధులకు కారణంగా మారుతుంది. పంచాయతీ అధికారులకు స్వీపర్లు పలుసార్లు వీటిని మరమ్మతులు చేయాలని కోరినా నిధులు లేవని అధికారులు చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. ఆగిపోయిన, విరిగిపోయిన రిక్షాల్లో వారానికి ఒకసారి అయినా చెత్తను సేకరించి నానా ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా పాడైన రిక్షాల స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాలని, పాతవాటిని మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

> **మరమ్మతులకు చర్యలు**
>
> చెత్తను సేకరించే రిక్షాలు మూలకు చేరితే వెంటనే మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. ప్రతి పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చి పనిచేయని రిక్షాల జాబితాను తీసుకొని మరమ్మతులు చేయించి వినియోగంలోనికి తీసుకురావడం జరుగుతుంది. పూర్తిగా పాడైన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.
>
> -బాబూరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, గొలుగొండ

యూరియా కోసం పడిగాపులు


వడ్డాదిలో యూరియా కోసం పేర్ల నమోదుకు కోసం అవస్థలు పడుతున్న రైతులు


వడ్డాదికి వచ్చిన యూరియా బస్తాలు


ఎ.కోడూరులో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకుడు సూర్యనారాయణ తదితరులు


కలిగొట్ల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎగబడిన రైతులు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. నెల రోజులకుపైగా యూరియా కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ వరినాట్లు దమ్ము చేసే సమయంలో, నాట్లు వేసిన తరవాత యూరియా వేద్దామన్నా ఎక్కడా దొరకలేదు. రైతు సేవా కేంద్రంలో గాని ప్రవేటు షాపుల వద్దకు రోజూ రైతులు యూరియా కోసం కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేదు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉండేది. రైతులకు అవసరమైనపుడు యూరియా తెచ్చుకుని పంటలకు వేసేవారు. వడ్డాదికి బుధవారం రాత్రి యూరియా లోడు రావడంతో వడ్డాది బజారువీధిలో కమ్యూనిటీ హాలులో దించారు. గురువారం ఉదయాన్నే యూరియా కోసం రైతులు కమ్యూనిటీ హాలు చుట్టూ చేరి క్యూలు కట్టారు. వ్యవసాయశాఖ సిబ్బంది కమ్యూనిటీ హాలు గేట్లు వేసి ఒక్కో రైతు నుండి ఆధార్ కార్డు, వన్‌బీలు తీసుకుని పేర్లు నమోదు చేసి యూరియా అందించారు. పేర్లు నమోదుకై రైతులతో పాటు మహిళా రైతులు కూడా కమ్యూనిటీ హాలు ఇనుపగేట్లు ఎక్కి ఉదయం నుంచి సాయింత్రం వరకు యూరియా కోసం నిరీక్షించారు. అయినా రైతులకు సరిపడా యూరియా బస్తాలు దొరకలేదు.

కె.కోటపాడు : ఖరీఫ్ సాగులో వివిధ పంటలను సాగు చేస్తున్న రైతాంగానికి అవసరమయిన యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని సీపీఎం నాయకుడు వనుము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. యూరియా కొరతపై గురువారం ఎ.కోడూరులో రైతులతో కలిసి ఆయన రాస్తారోకో జరిపారు. అంతంత మాత్రంగానే రైతులకు ఇస్తున్న యూరియా కారణంగా రైతులు పూర్తిగా పంటలకు వినియోగించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటకు అనువైన కాలంలో యూరియాను ఇవ్వకపోవడం వల్ల పంట ఏపుగా ఎదిగే పరిస్థితి ఉండదన్నారు. రైతులకు యూరియా ఇవ్వాలనే ముందుగా ప్రణాళికలను ప్రభుత్వం, అధికారులు తీసుకుంటే ప్రస్తుతం కొరత వచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అవసరానికి సరిపడా యూరియాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : కలిగొట్ల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గురువారం ఉదయం నుంచి రైతులు ఎగబడ్డారు. స్థానిక సొసైటీ పరిధిలో కలిగొట్లతో పాటు బోయిలకింతాడ, తిమిరాం, మామిడిపల్లి గ్రామాలు ఉండగా అరకొరగా యూరియా స్టాక్ రావడంతో తమకు దొరుకుతుందో లేదోనని ఆందోళనతో రైతులు బారులు తీరారు. గంటల కొద్దీ నిరీక్షణ చేసిన యూరియా బస్తా దొరికే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం తీరుపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సొసైటీ పరిధిలో వేలాది మంది రైతులు ఉంటే కేవలం రెండు వందల యూరియా బస్తాలు ఎక్కడ సరిపోతాయని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని పలువురు రైతులు నిలదీశారు. బోయిలకింతాడ, తిమిరాం, మామిడిపల్లి రైతులకు అరకొరగా పంపిణీ చేయడంపై ఆయా గ్రామాల రైతులు తీవ్రంగా మండిపడ్డారు.

రూ.15,500లకు లడ్డూ వేలం


వేలంలో పాటదారు సతీష్ దంపతులకు లడ్డూను అందజేస్తున్న సిద్ధూ వినాయక కమిటీ


ఆకట్టుకున్న వేంకటేశ్వరస్వామి నృత్య ప్రదర్శన

రోలుగుంట : స్థానిక సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన గణపతి నవరాత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు కమిటీ ఆధ్వర్యంలో మాలలు ధరించిన భక్తులు స్వామి వారి మండపాన్ని శుద్ధి చేసి పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. గురువారంతో ముగిసిన ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి వద్ద ఉన్న లడ్డూకు కమిటీ నాయకులు సంజీవి, శ్రీను, సత్తిబాబు వేలంపాట నిర్వహించారు. వేలంలో భక్తులు పోటీ పడగా గ్రామానికి చెందిన మద్దు సతీష్ రూ.15,500లకు అధికంగా పాడి దక్కించుకున్నాడు. అనంతరం స్వామి వారిని వాహనంపై వివిధ నృత్య ప్రదర్శనలు భజనలు,కోలాటాలు, బాణ సంచా కాల్పులతో భక్తుల సందర్శనార్థం వీధుల్లో ఊరేగించి స్థానిక కోనేరులో అనిపారు. వేంకటేశ్వరస్వామి నృత్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. కమిటీ వారు విగ్రహ దాత బొబ్బిలి రామ్మూర్తినాయుడు దంపతులను సత్కరించారు.

పీఎస్‌పేట లక్ష్మీగణపతికి లక్ష పత్రి పూజ

చోడవరం : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పురాతన పీఎస్‌పేట లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో గురువారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుట్రేవు శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు ఈ లక్ష పత్రి పూజను కన్నుల పండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో అన్ని గ్రామాల్లో నెలకొల్పిన వినాయకుడులను నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. వెంకన్నపాలెం, చోడవరం, దుడ్డుపాలెం, గోవాడ, గాంధీ గ్రామం తదితర ప్రాంతాల్లో తీన్‌మాన్ డబ్బులు, నేలవేషాలు, మంగళవాయిద్యాలతో వినాయకుడి నిమజ్జన ఊరేగింపులు ఎంతో సందడిగా నిర్వహించారు. సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దివ్యాంగుల గుర్తింపు శిబిరం విజయవంతం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణంనాయుడు తదితరులు

మాడుగుల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సమగ్ర శిక్ష, ఎలిమికో సంస్థ సంయుక్తంగా దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందజేయడానికి మెడికల్ క్యాంపు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. నియోజకవర్గం నుంచి 218 మంది తల్లిదండ్రులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పాల్గొన్నారు. ఈ క్యాంపులో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందజేయడానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఈశ్వరరావు, బి.దేముడమ్మ, ప్రధానోపాధ్యాయులు ముత్యాల నాయుడు, జగన్నాథరావు, ఐఈ జిల్లా కోఆర్డినేటర్ జి. కృష్ణంనాయుడు సీఆర్‌పీలు బొబ్బిలి హరికృష్ణ, వొమ్మలి అచ్చుతరావు, ఐఈఆర్‌టీలు సత్యారావు, ఆచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఉత్సవాలు


ఎ.కొత్తపల్లిలో వినాయకుని దర్శించుకుంటున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల రమణ


తామరబ్బ అన్నసమారాధనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో ఎస్.వి.ఎన్ యూత్, కొప్పాక ఇస్తువా వారి ఆధ్వర్యంలో జరిగిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వినాయకుని దర్శించుకొని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం జరిగిన అన్నసమారాధనను వడ్డన చేసి ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ ప్రారంభించారు. మేళతాళాల నడుమ నిమజ్జన మహోత్సవాన్ని నిర్వహించారు. తామరబ్బలో జరిగిన అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, సర్పంచ్ రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి, కడారి రాజు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు గోతిలో పడి విరిగిన ఆటో చక్రం


వీఆర్‌ఆర్‌పేట గోతిలో పడి విరిగిన ఆటో చక్రం

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు గోతుల్లో పడి ఆటో చక్రం విరిగిపోగా, ఆటో డ్రైవరు, ప్రయాణికులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. చోడవరం నుంచి శిరిజాం వెళ్తున్న ఆటో విజయరామరాజుపేట నూకాంబిక గుడి దగ్గర్లో గోతుల్లో పడి ముందు చక్రం స్టీరింగ్ విరిగిపోయింది. ఆటో డ్రైవరు చాకచక్యంగా ఆటోను నిలిపివేయడంతో బోల్తా పడకుండా జాగ్రత పడ్డాడు. ఇప్పటికే ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో ఆటోలకు బేరాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు గోతుల వల్ల ఆటోలు దెబ్బతిని ఆటో డ్రైవర్లు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు.

ఘనంగా టీచర్స్ డే


గిడుతూరులో టీచర్స్ డేలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం: గురుపూజోత్సవ వేడుకలు మండలంలోని గిడుతూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులంతా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీచర్స్ డే విశిష్టతను మాకవరపాలెం స్టేట్ బ్యాంకు మేనేజర్ చంద్రరావు విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరణ అభినందనీయం


కె.వి.రమణ

దేవరాపల్లి : జీవిత బీమా(ఎల్ఐసీ) పాలసీల ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరణ అభినందనీయమని ఏవోఐ స్టేట్ ఈసి మెంబర్ కె.వి.రమణ అన్నారు. దేవరాపల్లిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఎల్ఐసీ పాలసీలపై 18 శాతం ప్రీమియం విధించిందని, దీంతో పాలసీదారులపై ఎంతో ఆర్థిక భారం పడిందన్నారు. జీవిత బీమాపై జీఎస్టీ తొలగించాలని దేశ వ్యాప్తంగా ఎంపీలను కలిసి మెమోరండం అందించి నిరసన కార్యక్రమాలు చేపట్టామని, ఈ ఫలితంగా జీఎస్టీ ఉపహరించడం హర్షణీయమని అన్నారు. ఏవోఐ, పాలసీదారుల తరపున కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు స్టేట్ ఈసీ మెంబర్ రమణ పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాతో నిఘా


కె.కోటపాడులో డ్రోన్ సహాయంతో చిత్రీకరణ చేస్తున్న పోలీసులు

కె.కోటపాడు : అసాంఘిక కార్యక్రమాలను కె.కోటపాడు పోలీసులు డ్రోన్ సహాయంతో అడ్డుకట్ట వేసే చర్యలు చేపట్టారు. ఎస్ఐ ఆర్.ధనుంజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామ శివార్లలో డ్రోన్‌తో ప్రత్యేక చిత్రాలను చిత్రీకరించారు. తద్వారా శివారు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో గంజాయి వినియోగం, పేకాట, మద్యం సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు నిఘా పెట్టడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. డ్రోన్ ద్వారా నేరాలకు పాల్పడే వారిని కచ్చితంగా గుర్తించి ఆధారాలతో కేసులు నమోదు చేసేందుకు దోహదపడుతుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై 112, 94409 04209కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలి


ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డీఈవో అప్పారావు

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి చదువులపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఈవో అప్పారావు అన్నారు. ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆగస్టు వరకూ ఏఏ సబ్జెక్టులలో సిలబస్ పూర్తి చేశారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఉపాధ్యాయులు తప్పకుండా పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరంగా అందించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, పీఈటీ చిట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

తడి పొడి చెత్త వేరు చేసేలా అవగాహన కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో సందీప్

కె.కోటపాడు : ప్రతీ కుటుంబానికి సీఆర్పీ(క్లస్టర్ రీసోర్స్ పర్సన్)లు వెళ్ళి తడి, పొడి చెత్తను వేరు చేయు విధానంపై అవగాహనను కల్పించాలని జిల్లా పంచాయితీ అధికారి సందీప్ అన్నారు. చౌడువాడలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద కె.కోటపాడు, చీడికాడ, మాడుగుల మండలాలకు చెందిన సీఆర్పీ, పంచాయితీ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. సీఆర్పీలు సెప్టంబర్, అక్టోబర్ నెలల్లో 30 రోజుల పాటు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లో కుటుంబాలను కలిసి ఏఏ వస్తువులను తడి, పొడి చెత్తగా గుర్తించి వేరు చేయాలో తెలపాలని అన్నారు. తప్పనిసరిగా ఒక్కో సీఆర్పీ రోజుకి 50 కుటుంబాలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పిన్ బ్యాగ్ విధానం పైనా వివరించాలన్నారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ రాజేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు


నృత్యంతో అలరించిన విద్యార్థినులు


సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్స్ శోభ, పద్మావతి, అధ్యాపకులు

నర్సీపట్నం : నర్సీపట్నం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా సాగాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శోభ మాట్లాడుతూ రెండో సంవత్సరం విద్యార్థినులు మొదటి సంవత్సర విద్యార్థినులను ఆహ్వానిస్తూ ఈ వేడుకలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.పద్మావతి మాట్లాడుతూ అందరూ క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. వేడుకల్లో భాగంగా గురుపూజోత్సవం నిర్వహించారు.

కె.అగ్రహారంలో అన్నసమారాధన

మాకవరపాలెం : కొండలఅగ్రహారంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండపం ఏర్పాటు చేశారు. గురువారం మండపం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.